ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 25 మార్చి 2024

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

హరిపురం, మార్చి 24: తాళ్లగురంటి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల లోకనాథం చౌదరి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. ఆదివారం మందస మండలం భోగాపురం పంచాయతీ బొరంటోలో వైసీపీ నేతలు చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఆయనపై చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు.



ప్రచారంలో పాల్గొన్న లోకనాథం చౌదరి (వృత్తంలో ఉన్న వ్యక్తి)

వంశధార వంతెన.. ప్రమాదపుటంచున

- ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరుకున్న వైనం
- గ్రానైట్ రాళ్లతో భారీ వాహనాల రాకపోకలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- భయాందోళన ప్రజలు



హిరమండలం: కిట్టాలపాడు వద్ద శిథిలావస్థకు చేరుకున్న వంతెన



చవితి సీదికి వెళ్లే మార్గంలో శిథిలమైన వంతెన రక్షణ గోడలు

మరమ్మతులు శూన్యం..

హిరమండలం: హిరమండలం మండలంలోని భగీరథపురం నుంచి చవితి సీదికి వెళ్లే మార్గంలోనూ, కిట్టాలపాడుకు వెళ్లేదారిలో వంశధార ఎడమ కాలువపై వంతెనలు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. సుమారు 25 ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెనలకు ఇరువైపులా రక్షణగోడలు శిథిలమైనా మరమ్మతులు చేపట్టడం లేదు. ఈ వంతెనలపై రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమాత్రం అదుపుతప్పినా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తప్పదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

(టెక్కలి)

వంశధార ప్రధాన ఎడమకాలువపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం వీటి మరమ్మతులపై దృష్టి సారించకపోగా.. మరోవైపు ఈ వంతెనలపై గ్రానైట్ బ్లాకులతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఏరోజు వంతెనలు కూలుతాయో తెలియని దుస్థితి నెలకొంది. గతంలో టెక్కలి నుంచి అంజనాపురం మార్గంలో వంశధార వంతెన భారీ వాహనాల రాకపోకలతో కూలిపోయింది. గత ఏడాది జాతీయరహదారి నుంచి గొల్లవూరు వైపు వెళ్లే వంశధార వంతెన కూడా ఇసుక వాహనాల రాకపోకలతో కూలిపోయింది. వంశధార ప్రధాన ఎడమ కాలువపై 40ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలే వివిధ గ్రామాల రాకపోకలకు ప్రధానమార్గం. కాగా.. భారీ వాహనాల రాకపోకలతో వంతెనలకు ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

- టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ పరిధి బొరిగిపేట సమీపంలో ఉన్న వంశధార ప్రధాన వంతెనపై రక్షణగోడ కూలి అధ్వానంగా ఉంది. ఈ వంతెనపై నుంచి సుమారు 12కు పైగా గ్రానైట్ క్వారీలు బ్లాకులను తరలిస్తుంటాయి. ఈ ప్రాంత గ్రానైట్ క్వారీల్లోని వేస్ట్ రాళ్లు మూలపేట పోర్టుకు రక్షణగోడ నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వంతెన అనుకోకుండా కూలితే భీంపురం, పెద్దభీంపురం, డెప్పూరు, వంగర, కోదండపుం, సరియాపల్లి, జీడిపేట, కొత్తూరు, భీంపురం ఆశ్రమ పాఠశాలకు వెళ్లే మార్గం మూసుకుపోతుంది. వాస్తవానికి వంశధార కాలువలపై నిర్మించిన వంతెనలు అప్పట్లో 20టన్నుల సామర్థ్యానికి అధికారులు డిజైన్ చేశారు. అయితే ఈ వంతెనలపై ప్రస్తుతం 22 టైర్లు గల టైలర్ వాహనం 55 టన్నులతో, 18 టైర్లు గల టైలర్ వాహనం 50 టన్నుల వరకు, 16టైర్ల టారస్ వాహనం 48 టన్నులు, 12 టైర్ల టారస్ వాహనం 40 టన్నుల వరకు బరువులు తీసుకు పోతున్నాయి. నిత్యం పోర్టుకు రాళ్లు తరలించే డంపర్లు కూడా ఈ రోడ్లపై తిరుగుతుండడంతో ఈ వంతెనల పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. వంతెనలు కూలితే శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరాకు బ్రేకులు పడతాయోమోనన్న ఆందోళన కలిగిస్తోంది. వంశధార అధికారులు గతం లో భారీ వంతెన ఏర్పాటు చేసుకోవాలని గ్రానైట్ క్వారీల నిర్వాహకులకు సూచించినా.. కొత్త వంతెనల నిర్మాణాలు చేపట్టలేదు. తర్వాత అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనలపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. శిథిలావస్థలో ఉన్న వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ కె.శ్రీకాంత్ వద్ద ప్రస్తావించగా.. వంతెనలపై భారీ బరువులతో గ్రానైట్ వాహనాలు తరలివెళ్తున్న అంశంపై ఆయా శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ శాఖ నిర్మించిన వంతెనలు 20 టన్నుల బరువు సామర్థ్యం మేర రాకపోకలకు డిజైన్ చేశామని తెలిపారు.



టెక్కలి: బొరిగిపేట సమీపంలో వంశధార వంతెన ఇలా..

నగదు, మద్యం స్వాధీనం

హిరమండలం/ మెళియాపుట్టి/ పొందూరు, మార్చి 24: హిరమండలంలో ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి ఓ వాహనంలో తరలిస్తున్న నాలుగు మద్యం సీసాలతోపాటు రూ.77,600 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నారాయణస్వామి తెలిపారు. ఒడిశా నుంచి సబ్బవరం వెళ్లే వాహనంలో వీటిని గుర్తించి సీజ్ చేశామన్నారు. వాహన యజమాని బరికాన నూకరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో ఏఆర్ ఎస్‌ఐ అప్పారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హిరమండలం: పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం సీసాలు

- మెళియాపుట్టి మండలం పట్టుపురం వద్ద ఎన్నికల ప్రత్యేక బృందం అధికారులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ బెహరా, బలరాం బెహరా ఆరు బీరు సీసాలు తీసుకెళ్తుండగా పట్టుబడ్డారు. వీరిని మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.
- పొందూరు మండలం రాపాక చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి నరసన్నపేటకు చెందిన వ్యాపారి ఎల్.నగేష్ వద్ద ఎన్నికల స్క్వాడ్ సిబ్బంది రూ.1.95లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నరసన్నపేట నుంచి రాజాం కారులో వెళ్తుండగా ఎన్నికల స్క్వాడ్ తనిఖీ చేయగా లెక్క చూపని నగదును గుర్తించారు. నగదు, కారును స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ వై.రవికుమార్ కేసు నమోదు చేశారు.

ఎచ్చెర్ల సీటు బీజేపీకే?



ఎన్ఈఆర్

- అభ్యర్థిగా ఎన్ఈఆర్‌కు చాన్స్! ● నేడో రేపో ప్రకటన

శ్రీకాకుళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుల నేపథ్యంలో ఎచ్చెర్ల అసెంబ్లీ సీటు బీజేపీకే దక్కే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గం మినహా మిగిలిన ఏడుచోట్ల అభ్య ర్థులను టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఎచ్చెర్ల పెండింగ్‌లో ఉండడంతో అందరిచూపు ఈ నియోజకవర్గంపై పడింది. పొత్తులో భాగంగా శ్రీకాకుళం నియోజకవర్గాన్ని బీజేపీకి తొలుత ఇస్తామనుకున్నారు. కానీ తర్వాత సమీకరణాలు మారిపోయాయి. ఎచ్చెర్ల అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తూ బీజేపీ నాయకుడు నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) ఆ పార్టీ రాష్ట్ర నాయకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈయన ప్రస్తుతం విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈయన అభ్యర్థిత్వాన్ని ఇటు బీజేపీ.. అటు టీడీపీ అధిష్ఠానాలు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. నేడో, రేపో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, మార్చి 24: అరసవల్లిలో ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.5,68,359 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,21,800, విరాళాల ద్వారా రూ.62,784, ప్రసాదాల ద్వారా రూ.1,83,775 ఆదాయం లభించినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. అలాగే ఒక అజ్ఞాత భక్తుడు సూర్యనారాయణస్వామిని దర్శించుకుని.. 93.830 గ్రాముల బంగారు హారాన్ని విరాళంగా అందజేశారన్నారు. దీని విలువ రూ.5,24,962 ఉంటుందని తెలిపారు.





అరవసల్లిలో భక్తుల రద్దీ, అజ్ఞాత వ్యక్తి అందజేసిన హారం

భక్తిశ్రద్ధలతో కూర్మనాథుని డోలోయాత్ర

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని డోలోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి.. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో గురునాథరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద పులిహోర, గుడి వద్ద మజ్జిగ, గ్లూకోజ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



శ్రీకూర్మంలో బారులుదీరిన భక్తులు

‘దంతపురి’పై నిర్లక్ష్యం

- చారిత్రక సంపదకు రక్షణ కరువు
- కానరాని టూరిస్ట్ గైడ్లు
- పట్టించుకోని అధికారులు

(సరుబుజ్జిలి)

జిల్లాలోని ప్రముఖ చారిత్రాత్మక ప్రదేశాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న దంతపురి క్షేత్రాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఈ క్షేత్రం అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో విలువైన పురావస్తు సంపదకు రక్షణ కరువైంది. ఆమదాలవలస(శ్రీకాకుళం రోడ్) రైల్వేస్టేషన్ నుంచి 8 కిలోమీటర్ల దూరంలో దంతపురి క్షేత్రం ఉంది. రొట్టవలస, కొండవలస, పెద్దపాలెం, పాలవలస, రావివలస గ్రామాల మధ్య 175 ఎకరాల్లో విస్తరించి ఉంది. క్రీస్తుపూర్వం 261లో అశోక్ చక్రవర్తి చేసిన కళింగయుద్ధం తర్వాత ఈ క్షేత్రం ప్రాచుర్యంలోకి వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. దంతపురి వంశానికి రాజైన కళింగ ఖారవేలుని కాలంలో ప్రాముఖ్యత సంతరించుకుంది. కళింగ రాజుల రాజధానిగా దంతపురికి విశిష్ట స్థానం ఉంది. రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు 30 సంవత్సరాల కిందట చేపట్టిన తవ్వకాల్లో దంతపురి ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇక్కడి కోటలో 30 అడుగుల ఎత్తయిన ప్రాకారాలు, కోటకు నలుదిక్కులా ద్వారాలు ఉండేవని తెలిసింది. ఈ తవ్వకాల్లో మూడు స్థూపాలు, గుర్తించలేని పాతతరం విగ్రహాలు, స్నానపు గదులు, నీటి నిల్వజార్లు, ఫ్లవర్‌వైజ్‌లు, వంటపాత్రలు, దీపాలు, భోజనపు గిన్నెలు, రుబ్బురోళ్లు, ఎముకతో చేసిన దువ్వెనలు, టెర్రకోట వస్తువులు బయటపడ్డాయి.



శిథిలావస్థలో ఉన్న బుద్ధుని విగ్రహం

కనిపించని టూరిస్టు గైడ్లు..

దంతపురి సంపద రక్షణ కోసం ప్రభుత్వం ఇద్దరు టూరిస్ట్ గైడ్‌లను ఏర్పాటు చేసి ప్రతి నెలా వారికి జీతాలు చెల్లిస్తున్నట్టు సమాచారం. అయితే వారు ఏ రోజూ దంతపురి క్షేత్రంలో కనిపించిన దాఖలాలు లేవు. దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బుద్ధుని విగ్రహానికి రక్షణ లేకపోవడంతో శిథిలమవుతోంది. విలువైన కోట గట్టును కొంతమంది తవ్వకాలు చేపట్టి ఆక్రమిస్తున్నారు. ఇక్కడ ఏటా బుద్ధ పౌర్ణమి రోజున ఉత్సవాలు నిర్వహించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ క్షేత్రంలో చేపట్టిన తవ్వకాల్లో విలువైన బంగారు నాణేలు, తీగలు, వస్తువులు బయటపడగా వాటిని కొంతమంది చేజిక్కించుకొని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన విషయం తెలిసిందే. ఆరేళ్ల కిందట గుప్త నిధుల కోసం తవ్వకాలు కూడా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దంతపురి క్షేత్రాన్ని పరిరక్షించాలని పర్యాటకులు కోరుతున్నారు.





పురావస్తుశాఖ తవ్వకాల్లో బయటపడిన బౌద్ధకాలం నాటి వంట పాత్రలు, విగ్రహాలు (ఫైల్)

అదును చూసి అడ్డగోలుగా..

- ఎన్నికల విధుల్లో అధికార యంత్రాంగం
- నదీతీర గ్రామాల్లో ఇసుక తవ్వకాలు
- అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో..

(జలుమూరు/నరసన్నపేట)

నరసన్నపేట, జలుమూరు మండలాల్లో నదీతీర గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఇదే అదనుగా గ్రామస్థాయి అధికారపార్టీ నాయకులు కొందరు ఇసుక దోచేస్తున్నారు. అనుమతులు లేకున్నా.. ఉన్నాయని పాత పత్రాలను చూపిస్తూ.. అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నారు.

- జలుమూరు మండలం దొంపాక, పర్లాం కేంద్రంగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వం అనుమతిచ్చిన భౌగోళిక ప్రాంతంలో తవ్వకాలు పూర్తి చేసిన సమీపం ప్రాంతాలకు ర్యాంపులను విస్తరించారు. పాత అనుమతుల పత్రాలతో భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. దొంపాక వద్ద వంతెన సమీపం వరకు కూడా తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనల మేరకు నదిలో 2 మీటర్లు వరకే తవ్వకాలు చేయాలి. కానీ భారీ యంత్రాలతో 5 మీటర్లు లోతు వరకు తవ్వకాలు చేస్తున్నారు. దీంతో సమీపంలోని కొమానపల్లి వంతెనకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. వరదల సమయంలో వంతెన పిల్లర్లు దెబ్బతినే అవకాశం ఉందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. వంతెనకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల వరకు అనుమతులు ఇవ్వరాదు. కాగా అధికారపార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలున్నాయి.
- నరసన్నపేట మండలం చేనులవలస ఇసుక ర్యాంపులో అనుమతులు లేవు. కానీ స్థానిక వైసీపీ నాయకురాలు ఆధ్వర్యంలో జోరుగా తవ్వకాలు సాగుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్ లోడు రూ.3వేలు చొప్పున, లారీ లోడు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నారు. లుకలాం ఇసుక ర్యాంపులో అధికారులు ట్రెంచ్‌లు ఏర్పాటు చేసినా జీడితోటల నుంచి నదిలోకి వెళ్లి అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. లుకలాంలో స్థానిక నాయకులంతా రింగ్‌గా ఏర్పడి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ కనకరావు వద్ద ప్రస్తావించగా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేసేందుకు ట్రెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేసేవారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జలుమూరు మండలం దొంపాక వద్ద భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు



నరసన్నపేట మండలం చేనులవలస ర్యాంపులో..

ఆగని తవ్వకాలు.. జాడలేని అధికారులు

ఆమదాలవలస: ఆమదాలవలస మండలంలోని వంశధార నది పరివాహక ప్రాంతమైన చవ్వాకులపేట వద్ద ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపు లేకపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ర్యాంపు నుంచి రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలతో ఇసుకను విశాఖపట్నానికి రవాణా చేస్తుండడంతో రహదారులు దెబ్బతిని అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీలతో ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు, పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం నది నుంచి ఇసుకను వేరే ప్రాంతంలోని డిపో కేంద్రానికి తరలించి.. అక్కడి నుంచి విక్రయాలు చేపట్టాలి. కానీ ఈ నిబంధనలు అమలుకావడం లేదు. రాత్రివేళల్లో కూడా నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నా అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లారీలను అడ్డుకునే సమయంలో పోలీసులు గ్రామస్థులకు, ఇసుక తవ్వకాల నిర్వాహకులకు సర్దిచెప్పి వదిలేస్తున్నారు. మరునటిరోజు యథావిధిగా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా సాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. ఇసుక తరలించే వాహనాలపై సీఎం జగన్ చిత్రం ఉన్న స్టిక్కర్లను అతికించి.. యథేచ్ఛగా రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



చవ్వాకులపేట వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలు

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు

- నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇదీ సిద్ధాంతం గ్రామ రహదారి దుస్థితి

సిద్ధాంతం (ఎల్.ఎన్.పేట)

సిద్ధాంతం గ్రామానికి వెళ్లే రహదారి పనులు అర్ధంతరంగా నిలిచి పోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం గుండా సిద్ధాంతంతో పాటు గడే వానిపేట, సుమంతాపురం, ఉప్పరపేట, మతలబుపేట గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానమైన రోడ్డు అలికాం-బత్తిలి రోడ్డుకు ఆనుకుని సిద్ధాంతం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అలికాం- బత్తిలి రోడ్డు నుంచి సిద్ధాంతం వరకు రోడ్డు మొత్త ఎక్స్‌కవేటర్‌తో తవ్వించి రోడ్డుకు రెండువైపులా మట్టి వేసి విడిచిపెట్టారు. దీంతో ఆ రోడ్డుగుండా వెళ్లేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో నరక యాతన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుపై రాళ్లుతేలిపోయి కనీసం నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రోడ్డు నిర్మాణం ప్రారంభించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినటు సర్పంచ్ జి. కోటేశ్వరరావు, గ్రామస్థులు సాయిరాజ్, టి.లక్ష్మణరావు తదితరులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో నిధుల మంజూరు సాధ్యం కానందున కనీసం మరమ్మతులైనా తాత్కాలికంగా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రాళ్లుతేలి దారుణంగా ఉన్న సిద్ధాంతం గ్రామ రహదారి


బెండి గ్రామం వద్ద ఒకవైపు మాత్రమే నిర్మించిన సిమెంట్ రోడ్డు

సగం రోడ్డేసి వదిలేశారు..

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి గ్రామం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన సీసీ రోడ్డు ఒకపక్క సగం నిర్మించి మరోపక్క వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క ఎత్తుగా మరో పక్క పల్లంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహన చోదకులు పేర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గ్రామం వద్ద రెండులైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఒకవైపు పనులు ప్రారంభించి సగంలో వదిలేశారు. మిగిలిన సగం పనులు ఎప్పుడు పూర్తవుతాయో సంబంధిత అధికారులకే ఎరుక. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా బోల్తా కొట్టే ప్రమాదాలున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


అంగూరులో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందిస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట), మార్చి 24: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బగ్గ రమణమూర్తి అన్నారు. ఆదివారం అంగూరు గ్రామంలో పర్యటించి ప్రజలను కలిశారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించి, రానున్న టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. నవరడ్డపనస పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖలో బయటపడిన డ్రగ్స్ మాఫియాపై సీబీఐతో సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మాఫియా వెనుక అధికార పార్టీ నేతలదే కీలకపాత్ర ఉందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి దర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యువతకు అండగా టీడీపీ

నరసన్నపేట: యువతకు ఉపాధి కల్పనతోపాటు నిరుద్యోగి భృతి ఇచ్చి టీడీపీ అండగా ఉంటుందని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు బలగ ప్రహర్ష అన్నారు. ఆదివారం దూకలపాడులో సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులు బగ్గు రమణమూర్తి, కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లు అప్పన్న తదితరులు పాల్గొన్నారు. ● **నందిగాం:** పెద్దలవునిపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు పి.అజయ్ కుమార్ విస్తృతంగా అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపిం చాలని కోరా రు. ● **టెక్కలి:** రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. ఆదివారం టెక్కలి మేజర్‌పంచాయతీ గొల్లవీధి, రెడ్డికవీధి ప్రాంతాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ● **సంతబొమ్మాళి:** టీడీపీ హయాంలోనే మత్స్యకారుల సంక్షేమం సాధ్యపడిందని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. ఆదివారం తీరప్రాంత గ్రామమైన జగన్నాథపురంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు భానుప్రకాష్, ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తులసీదాస్ సిద్ధాంతాల కోసం పనిచేస్తా: త్రినాథ్‌బాబు

పలాస: పలాసలో ఎన్ని పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నా కాంగ్రెస్ విజయం తథ్యమని దివంగత పీసీ సీ అధ్యక్షుడు మజ్జి తులసీదాస్ కుమారుడు, కాంగ్రెస్ నేత త్రినాథ్‌బాబు అన్నారు. ఆదివారం స్థానికంగా మజ్జి అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి తులసీదాస్ మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కార్యక ర్తలకు కష్టమొస్తే ఆదుకునేవారని, ఆయన సిద్ధాంతాలతోనే తాను ప్రజల కోసం పనిచేస్తానన్నారు. యువ త ఉపాధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, నేతలు బేసి శ్యామసుందర రావు, పైడి పట్టాభి, హేమారావు చౌదరి, మాదిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహను కలిగి ఉండాలి

నరసన్నపేట: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక స్పృహను కలిగి ఉండాలని హెచ్‌సీ దాలినాయుడు అన్నారు. జమ్ము, సత్యవరం గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు ముగింపు కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలలు ప్రిన్సిపాళ్లు కృష్ణారావు, ప్రసాదరావు, పీవోలు అప్పారావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల మాటే శిరోధార్యం: కలమట

కొత్తూరు: కార్యకర్తల మాటే తనకు శిరోధార్యమని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ స్పష్టం చేశారు. నివగాం గ్రామంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేస్తే ఇచ్చిన గౌరవం ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధిష్ఠానం గుర్తించి బి-ఫారం ఇచ్చి న్యాయం చేస్తారని ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

సమస్యల పరిష్కారాలకు హామీలైనా పొందాలి

పాతపట్నం: సమస్యల పరిష్కారానికి ఎన్నికల హామీలైనా పొందాలని పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు భీంసేన్ పండా అన్నారు. స్థానిక ఒడియా పాఠశాల ప్రాంగణంలో సంఘ అత్యవసర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను త్వరలో సత్కరించనున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.మిన్నారావు, గౌరవాధ్యక్షుడు రేగేటి మధుసూదనరావు, రాష్ట్ర కార్యదర్శి అమర జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ ప్రారంభోత్సవంలో నృత్యాభినయం ఆనందం

నరసన్నపేట: చైన్నైలో చిదంబరం క్రికెట్ స్టేడియంలో ఈనెల 22న జరిగిన ఐపీఎల్ ప్రారంభో త్సవంలో వందేమాతరం గీతానికి నృత్య ప్రదర్శన చేయడం ఆనందంగా ఉందని శ్రీ కూచిపూడి నృత్య విద్యాలయం విద్యార్థినులు అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. కోట్లాది ప్రజలు వీక్షించే ఐపీఎల్ ప్రారంభో త్సవంలో నరసన్నపేటకు చెందిన 10 మంది నృత్యకళాకారులు పాల్గొన్నారని శిక్షకు రాలు కీర్తిప్రియ అన్నారు. దేవేంద్ర షీలార్ సంగీతం అందించిన వందేమాతరం గీతానికి నృత్యాభినయం చేసిన వారిలో కె.శ్రీలక్ష్మి, కె.లక్ష్మీభవాని, జి.స్రవంతి, బి.గీత, జి.కావశ్రీ, ఆర్.హిమబిందు, వి.గ్రీష్మ, లావణ్య, అనిత, శిక్షకురాలు కీర్తిప్రియ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

ప్రియాగ్రహారం(పోలాకి): డోలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రియాగ్రహారం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం కొనసాగుతున్నాయి. ఈ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం పోటీలు ముగిస్తాయని, విజేతలకు బహుమతులు అంది స్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా అచ్చెన్న ముందస్తు జన్మదిన వేడుకలు


నందిగాంలో అచ్చెన్నాయుడుకు కేక్ తినిపిస్తున్న నాయకులు

టెక్కలి/నందిగాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు ముందస్తుగా ఆదివారం నిర్వహించారు. ఈనెల 26న ఆయన పుట్టినరోజు అయినప్పటికీ ఆరోజు తిరుమల స్వామి దర్శనానికి వెళుతుండడంతో ముందస్తుగా టెక్కలి, నందిగాంలలో పార్టీ నేతలు నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నందిగాంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నందిగాంలో నూతనంగా ప్రతిష్ఠించిన పాతపట్నం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణిగాం, వేణుగోపాలపురం తదితర గ్రామాల్లో పర్యటిం చారు. కార్యక్రమాల్లో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, నందిగాం, టెక్కలి మండ ల పార్టీల అధ్యక్షులు పి.అజయ్ కుమార్, బి.శేషగిరితో పాటు పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పోలాకి: పిన్నింటిపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన నిర్మాణ పనులు చేపడుతున్నందున సోమవారం వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకర రావు, ఏఈ విశ్వేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో గుప్పెడుపేట, గుల్లవానిపేట, జొగంపేట, కంబాలవానిపేట, పరపతివానిపేట, మిరియబిల్లిపేట, వనవిష్ణు పురం, బార్జిపాడు, రహిమాన్‌పురం, రాజపురం, శివరాంపురం, బొద్దాం, ప్రియాగ్రహారం, పాల వలస, సుసరాం, అక్కువరం, కొవిరిపేట, సొండిపేట, అప్పారావు పేట, బెలమర, చిన్నకోడూరు ప్రాంతాల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో..

సంతబొమ్మాళి: బోరుభద్ర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమత్తులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఏఈ శివకుమార్ కోరారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ఈదులవలస(పోలాకి): ఈదులవలస ఆదర్శ పాఠశాల/కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ పైడి ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ప్రవేశం కల్పించనున్నామన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదుచేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కాపీ జిరాక్స్‌కు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఇతరులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. మార్కుల మెరిట్ రిజర్వేషన్ కేటగిరీ మేరకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 99492 45179 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న శివాజీ

వజ్రపుకొత్తూరు: మెట్టూరు గ్రామంలో ప్రతిష్ఠించిన కొండ మహంకాళి అమ్మవారిని ఆది వారం మాజీ మంత్రి గౌతు శివాజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు తీర్థ ప్రసాదాలిచ్చి ఆశీర్వ దించారు. అనంతరం నువ్వలరేవులో సీనియర్ టీడీపీ కార్యకర్త బెహరా ఉద్దేబ్ అనారోగ్యంతో బాధపడు తుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



'జీరు' కుటుంబానికి అచ్చెన్న పరామర్శ

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీకి చెందిన జీరు వెంకటరెడ్డి కుమారుడు అనారోగ్యానికి గురవడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోలోత్సవాలకు పోటెత్తిన భక్తజనం

- వల్లభ నారాయణుని దర్శించుకున్న భక్తులు


స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

హరిపురం: రట్టి వల్లభనారాయణ స్వామి డోలోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు వందలాది భక్తులు తరలిరావడంతో ఆలయంతో పాటు సముద్రతీరం భక్తజనులతో కళకళలాడింది. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలను సమర్పించుకున్నారు. ఈవో ప్రభాకరరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు, తిరువీధి మహో త్సవం నిర్వహించారు. హరిపురం, పలాస, సోంపేట నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.


ఆలయ ఆవరణలో కామదహనం చేస్తున్న భక్తులు

ఘనంగా కామదహనోత్సవం

పలాసరూరల్: స్థానిక బంకేశ్వరి మాత ఆలయం వద్ద ఒడియా బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మఖ నక్షత్ర ఆగమనం సందర్భంగా ఆదివారం కామదహనోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజాగ్ని వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని ఒడియా బ్రాహ్మణ సంఘ నేతలు తెలిపారు. కామ, క్రోధ, మద, మాత్సర్యాలను అదుపులో ఉంచి ఆదర్శమైన జీవన విధానమే రాజాగ్ని వేడుకల ప్రధాన లక్ష్యమన్నారు. సుమారు 300 ఏళ్ల నుంచి డోలో పౌర్ణమి నాడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కామ దహనోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా బలప్రదర్శన పోటీలు

జలుమూరు (సారవకోట): వడ్డినవలసలో ఆదివారం బలప్రదర్శన పోటీలు ఉల్లాసంగా జరిగాయి. గ్రామంలోని త్రినాథస్వామి ఆలయ 67వ వార్షికత్సవం సందర్భంగా దివంగత ఇప్పిలి గణపతిరావు మాస్టారు జ్ఞాపకార్థం కుమారులు ఆంజనేయప్రసాద్, రవి, వేణు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీ నిర్వహించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలో 160 కేజీల బరువు ఎత్తి నిమ్మాడకి చెందిన ఆవల గోవిందరావు విజేతగా నిలువగా, పొందూరుకి చెందిన ఎస్.రజాక్ ద్వితీయ స్థానం సాధించాడు. సంగిడీ, విసురుగుండు పోటీల్లో ఒప్పంగికి చెందిన గేదెల సత్యనారాయణ ప్రథమ, ఎస్.రజాక్ ద్వితీయ స్థానం సాధించారు. ఈడుపు సంగిడీలు పోటీలో ఆవల గోవిందరావు ప్రథమ, ఎస్.రజాక్ ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలకు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మెండ రాంబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.


వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమస్థానం సాధించిన ఆవల గోవిందరావు

రాష్ట్రంలో బీసీలకు రక్షణ కరువు

- చేనేత కుటుంబం బలవన్మరణానికి కారుకులను శిక్షించాలి
- పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు

హిరమండలం: రాష్ట్రంలో వైసీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలకు ప్రాణాలతో పాటు ఆస్తులకు రక్షణ కరువైందని, దీనికి కడప జిల్లా మాధవరానికి చెందిన చేనేత కార్మిక కుటుబం బలవన్మరణాలే నిదర్శనమని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. చేనేత కుటుంబం బలవన్మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీల్లో అత్యంత వెనుకబాటుకు గురైన చేనేత వర్గానికి చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు బలవన్మరణం చెందడం కలిచివేసిందన్నారు. బీసీ ద్రోహుల పార్టీగా వైసీపీ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్రంలో పేదల ప్రాణాలతో పాటు ఆస్తులకు కూడా రక్షణ కరువైందని, ఈ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న గోవిందరావు

అభివృద్ధికి దూరంగా సుమ్మాదేవి రైల్వే స్టేషన్

- కనీస సదుపాయాలు లేక ఇక్కట్లు

పలాసరూరల్: బ్రిటీష్ కాలం నుంచి ఉత్తమ రైల్వే స్టేషన్‌గా పేరొందిన సుమ్మా దేవి స్టేషన్ ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి, మౌలిక వసతులు లేక అంధకారంలో మగ్గుతోంది. ఈస్టుకోస్టు రైల్వే జోన్‌లో ఖుర్దారోడ్డు రైల్వే డివిజన్‌కు చెందిన సుమ్మాదేవి ఒకప్పుడు రవాణా, ప్రయాణికులకు టిక్కెట్ విక్రయాలు, ఇతర సాంకేతిక సహకారాల్లో ఉత్తమ స్టేషన్‌గా పేరుపొందింది. అయితే ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా కనీస సదుపాయాలు లేక అభివృద్ధికి ఆమడదూరంలో పయనిస్తోంది. ప్రధానంగా పలాస రైల్వే స్టేషన్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రైల్వేస్టేషన్ గతంలో పలాస లో ఎటువంటి సాంకేతిక సమస్యలు వచ్చినా రైళ్లు ఆగే సమయాల్లో ఈ స్టేషన్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించేవారు. రెండు ప్లాట్‌ఫారాలు కలిగి కేవలం ఒకే ఒక పాసింజర్ రైలు (పలాస టూ కటక్-08534-08533) మాత్రమే ఉదయం 4.15 గంటలకు, తిరిగి రాత్రి 10.20 గంటలకు ఈ స్టేషన్‌లో నిలుపుదల చేస్తుండడంతో ప్రయాణికులు లేని స్టేషన్‌గా మిగిలి పోయింది. గతంలో ఈ ప్రాంతం నుంచి ఉదయం, రాత్రి వేళల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులు.. ముఖ్యంగా ఉద్దాన ప్రాంతం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఈ స్టేషన్‌లో సరైన విద్యుత్ సౌకర్యం, కనీస సదుపాయాలు, స్టేషన్‌కు చేరుకునేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో ప్రస్తుతం వెలవెల బోతోంది. స్టేషన్‌లో ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వారు 3, సిగ్నల్ శాఖకు సంబంధించి 2, ఐఓడబ్ల్యు సంబంధించి 10 మంది ఉండగా, ఈ స్టేషన్ పరిధిలో సుమ్మాదేవి, కొబ్బరిచెట్లపూరు, నీలావతి గేట్లు ఉన్నాయి. వీటిలో 12 మంది ఉద్యోగులు గేట్ కీపర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఉద్యోగులు ఉండేందుకు క్వార్టర్లు, విశ్రాంతి గదులు లేకపోవడంతో వారంతా పలాస నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఉద్యోగులు విశ్రాంతి తీసుకునేందుకు సరైన వసతులు లేవని వాపోతున్నారు. అలాగే ఉద్దాన ప్రాంతంలో జీడి తోటలు ఎక్కువగా ఉండడంతో ఒక్కో సమయంలో ఎలుగుబంట్లు స్టేషన్‌లోకి వస్తున్నాయని, దీంతో భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళల్లో కోతుల బెడద తప్పదని, ఒక్కోసారి పాసింజర్ రైళ్లు ఆపితే గుంపులుగా కోతులు చేరి నానా బీభత్సం చేస్తుంటాయని వాపోతు న్నారు. రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి పాసింజర్ రైళ్లను ఆపితే వివిధ ప్రాంతాలకు రాకపోకలకు సులువుగా ఉంటుందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి సదుపాయాలు కల్పించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.


సుమ్మాదేవి రైల్వేస్టేషన్

వైసీపీకి ఓటమి ఖాయం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్


టీడీపీలో చేరిన కార్యకర్తలతో కూన రవికుమార్

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస పరిసర ప్రాంతాల్లో బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహన్ ఆధ్వర్యంలో శంఖారావం సూపర్‌సిక్స్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ పదో వార్డులో వైసీపీకి చెందిన 25 కుటుంబాలు టీడీపీ నాయకులు శ్రీరాములు, విజయకుమార్, కృష్ణకాంత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. గాంధీనగర్‌కు చెందిన 20 కుటుంబాలు కరుణాకర్ నుంచి రాము, అశోక్, రాజు, మురళి ఆధ్వర్యంలో 25 కుటుంబాలు, తొమ్మిదో వార్డు రాజేంద్రనాగళ్ల, మురళి ఆధ్వర్యంలో 22 కుటుంబాలు, 11 వార్డుకు చెందిన మాలిక్, రమణ, లంక నాగరాజు ఆధ్వర్యంలో 25 కుటుంబాలు, పంతులుపేటకు చెందిన టీడీపీ నాయకుడు తంగి శంకరరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, అక్కివలసకు చెందిన టీడీపీ నాయకుడు తంగి గురయ్య ఆధ్వర్యంలో 60 కుటుంబాలు, మండలంలోని గాజులకొల్లివలస, శ్రీహరిపురం గ్రామాలకు చెందిన ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు లోపింటి నారాయణరావుతోపాటు 50 మంది టీడీపీలో చేరారు. అనంతరం సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని ఇం టింటా నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాత్రుని పాపారావు, నూకరాజు, బోర గోవిందరావు, పైడి మురళీమోహన్, ఎన్ని శ్రీదేవి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా సాగర్, మొదలవలస రమేష్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోండి

బీసీలపై దమనకాండను ఆపి నిందితులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన ఓ చేనేత కుటుంబం వైసీపీ నాయకుల భూకబ్జా దాహానికి బలైపోవడం బాధాకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన ఎన్నోకుటుంబాలను వైసీపీ ప్రభుత్వం హతమార్చిన కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు లేని దృశ్యం

జలుమూరు: శ్రీముఖలింగం వద్ద గ్రామానికి చెందిన గుంట నరసింహమూర్తి పొలంలో వ్యవసాయ పంపుసెట్‌కు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు శనివారం చోరీకి గురైందని ట్రాన్స్‌కో ఏఈ వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. రాగి వైరు దొంగతనానికి గురవుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ సామగ్రి చోరీలో ఎటువంటి సమాచారం తెలిసినా విద్యుత్ శాఖ అధికారులకు, పోలీసులకు వెంటనే తెలియజేయాలని ఆయన కోరారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శిలా ఫలకాలు మూశారు..



గార: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా పలు గ్రామాల్లో శిలాఫలకాలపై ముసుగువేయని వైనాన్ని శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఎన్నికల కోడ్ వర్తించదా' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కె.మత్స్యలేశం బీచ్‌లో పర్యాటక శాఖ కాటేజీ ఎదుట ఉన్న శిలాఫలకంపై వమరవల్లి డైట్ వద్ద నూతన భవనాలు వద్ద ఉన్న శిలాఫలకంపై సంబంధిత అధికారులు పేపర్లు అంటించారు.

వత్సవలసలో రాజమ్మ యాత్ర


గుడి వద్ద భక్తులు పూజలు

గార: వత్సవలసలో రాజమ్మ యాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో వీధులన్నీ నిండిపోయాయి. దూర ప్రాంతాలకు చెందిన భక్తులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో ఇక్కడకు చేరుకున్నారు. శనివారం రాత్రి గ్రామంలో బసచేసిన తర్వాత భక్తులు ఆదివారం ఉదయం సముద్ర స్నానాలు ఆచరించి రాజమ్మను దర్శించుకున్నారు. సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

'అసమ్మతి వ్యక్తిని ప్రోత్సహించడం సరికాదు'


మాట్లాడుతున్న మాజీ మంత్రి గుండ

అరసవల్లి: అసమ్మతి వ్యక్తిని ప్రోత్సహించడం సరికాదని, మా కుటుంబంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎందుకంత కోపమని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక అరసవల్లిలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దని, పార్టీయే ప్రధానమని, చంద్రబాబు విజన్ గల నాయకుడని కార్యకర్తలకు వివరించారు. నియోజకవర్గంలో విభేదాలకు కారణమైన అసమ్మతి నాయకుడికి టికెట్ ఇవ్వడం బాధ కలిగించిందన్నారు. అందరి ఆవేదనను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

విద్యా రంగంలో లౌకిక విధానం ఉండాలి



మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

గుజరాతీపేట: భారతదేశంలో అన్ని రంగాల్లో లౌకికత్వాన్ని పెంపొందించే పద్ధతులు ఉండాలని, ప్రధానంగా విద్యారంగంలో లౌకిక విధానం ఉండాల్సిందేనని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళావేదికగా అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా లౌకిక భావజాలం అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మానవ సమాజంలో ఉత్పత్తి క్రమం ప్రారంభించి 12 వేల సంవత్సరాలు అయిందని, ఇందులో ఎన్నో ఆవిష్కరణలు జరిగాయన్నారు. నేడు భారతదేశంలో ఉన్న భారతజాతి ఏకం చేసిన పెద్ద పోరాటం భారతదేశ స్వతంత్ర పోరాటమన్నారు. పూలే, రాజారామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం, జిడ్డు కృష్ణమూర్తి, గాంధీ, గోపాలకృష్ణ గోకులే, అంబేడ్కర్ వంటి వారందరూ భారతదేశంలో విద్య అనేది అందుబాటులో ఉండాలని తాపత్రయం పడ్డారన్నారు. ఈ సదస్సులో పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు, ఐ.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి, కె.శ్రీనివాసరావు, ఏఎస్ కుసుమకుమారి, లక్ష్మీరాజా, ఎస్.అరుణకుమారి, టి.అన్నారాము తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిపేటలో పోలీసు కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: బొబ్బిలిపేట, కొత్తవలస, జీకేవలస సమస్యాత్మక గ్రామాల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం పోలీసుల కవాతు నిర్వహించారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ పిలుపునిచ్చారు.

కూర్మనాథుని సన్నిధిలో న్యాయాధికారి


స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఆదివారం జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు న్యాయాధికారి ఎస్ఎం ఫణికుమార్ దంపతులు దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. స్వామివారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు వారికి అంద చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

శ్రీకాకుళం అర్బన్: క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో టీబీ శాఖ డీటీవో ఎం.ప్రసాదరావు అధ్యక్షతన ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో మీనాక్షి క్షయవ్యాధికి కారణమైన బాక్టీరియాను 1882లో కనుగున్న శాస్త్రవేత్త రాబర్ట్ కాక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజల్లో క్షయ నివారణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోషకాహార లోపం, వ్యాధి నివారణ శక్తి లోపం కారణంగా టీబీ వ్యాధి వ్యాప్తి జరుగుతుందన్నారు. గతేడాది 1,450 కొత్త కేసులు గుర్తించామని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలైన దగ్గు, రెండు వారాల పాటు జ్వరం, బరువు తగ్గడం, నోటి నుంచి రక్తం కారడం వంటి జరిగితే తక్షణం వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడటం వల్ల వ్యాధిని నియంత్రించవచ్చని వివరించారు. అనంతరం క్షయ వ్యాధి నివారణకు కృషి చేస్తున్న వైద్యులు బొడ్డేపల్లి సురేష్, న్యూబ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు మణికంఠ, నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎద్మావతి, టీబీ అసోసియేషన్ సెక్రటరీ మంత్రి వెంకటస్వామి, ఎస్‌టీఎస్ పి.చిరంజీవి, ఎస్‌టీఎల్ఎస్ వై.హేమలత, డీపీపీసీ డీపీఎం కె.ఉమామహేశ్వరరావు, ఎల్‌టీ ఎస్.ఉమామహేశ్వరిలకు జ్ఞాపికలు అందజేశారు. అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.జయకరరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటండి


క్రీడాకారులను అభినందిస్తున్న సంఘ అధ్యక్షుడు సురేష్‌కుమార్


శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయస్థాయి పోటీలకు బయలుదేరుతున్న జిల్లా జట్టుకు స్థానిక టౌన్‌హాల్‌లో అభినందిస్తూ విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు. గతేడాది డిసెంబరులో విజయనగరంలో జరిగిన సబ్‌జూనియర్ పోటీల్లో ఎన్.వెంకటసూర్య, ఎస్.గాయత్రి ఫాయిల్ విభాగంలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 25వ తేదీ నుంచి రాజమండ్రిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరిద్దరు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో కోచ్ జోగిపాటి వంశీ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలు పూర్తయ్యేదెన్నడో?


ఇసుకపాలెం శ్మశాన వాటిక దుస్థితి

సరుబుజ్జిలి: గ్రామాల్లో శ్మశాన వాటికలు అభివృద్ధి నత్తనడకన సాగుతున్నాయి. దశాబ్దాల తరబడి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి దహన సంస్కారాలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నియోజకవర్గంలోని 110 పంచాయతీల్లో 84 శ్మశాన వాటికలకు ప్రతిపాదన చేయగా 83 మంజూరయ్యాయి. వీటి అభివృద్ధికి గతంలో ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించారు. వీటిలో కొన్నింటి అభివృద్ధి పనులు ముగింపు దశలో ఉండగా మరికొన్ని నత్తనడకన సాగుతున్నాయి. ఇంకొన్ని పూర్తిగా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి. గ్రామాల్లో ఇటీవల శ్మశాన వాటికలు నిర్మించిన గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించనందునే అసంపూర్తిగా నిలిచిపోయాయి. సరుబుజ్జిలి మండలంలో 21 పంచాయతీల్లో 13 శ్మశాన వాటికలకు ప్రతిపాదనలు చేయగా 12 మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటివరకు ఐదు మాత్రమే ప్రారంభానికి నోచుకొని వివిధ దశల్లో ఉన్నాయి. వీరభద్రాపురం, కూనజమ్మన్నపేట, ఇసుకలపాలెం, పాలవలస, చిగురువలసలో పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇందులో మతలబుపేట శ్మశానవాటిక 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇప్పటికైనా శ్మశాన వాటికలను నిర్మించాలని కోరుతున్నారు.

అమ్మో పాగిరి రోడ్డా.. నరకమే


నీటిలో నుంచి వెళ్లాల్సిందే

జి.సిగడాం: పెంట నుంచి పాగిరి కూడలికి వెళ్లే సుమారు రెండున్నర కిలోమీటర్ల రహదారి చిన్నపాటి వర్షానికే కాలువలా తయారైంది. కనీసం నడవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ఈ నీటిలోనే వెళ్లాల్సి వస్తుంది. అడుగడుగునా గుంతలే ఉండడంతో రాకపోకలకు ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డుకిరువైపులా ట్రెంచ్‌లు వేసి, రహదారి పనులు గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై వెళ్లేవారు అమ్మో పాగిరి రోడ్డా అంటూ భయపడుతున్నారు.

చినుకుపడితే చిత్తడే


మట్టిరోడ్డును తలపిస్తున్న పెంట ప్రధాన వీధి

జి.సిగడాం: చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతుంది పెంట గ్రామ ప్రధాన వీధి. ఇటీవల ఇంటింటి కొళాయిల కోసం బాగా ఉన్న సీసీ రోడ్డులను తవ్వి పైపులైన్లు వేశారు. పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సందంగా వదిలేశారు. దీంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ప్రధాన వీధితో పాటు పలు వీధులు బురదమయంగా మారి చిత్తడిగా తయారయ్యాయి. దీంతో పాదచారులు నడిచేందుకు, వాహనాలు వెళ్లేందుకు కూడా ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.


ఎండిపోయిన మిరియాల చెరువు

అభివృద్ధికి నోచుకోని మిరియాల చెరువు

గార: కళింగపట్నం మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న పురాతనమైన మిరియాలు చెరువు దశాబ్దాలు గడిచినా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఒకప్పుడు నీటితో కలకలలాడిన ఈ చెరువు చుక్క నీరు లేక వెలవెలబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత సరోవర్ పథకంలో ఈ చెరువును చేర్చి అభివృద్ధి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు రూపొందించి పంపినా మంజూరు కాకపోవడంతో స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా చెరువు గట్టు కొంత ఆక్రమణకు గురై చెత్తాచెదారం వల్ల అపరిశుభ్రంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ ఏడాదైనా అమృత సరోవర్ పథకంలో ఈ చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సామాజికవేత్తల విగ్రహావిష్కరణ

పొందూరు: యంగ్‌స్టార్స్ యువజనసంఘం స్థాపించి పొందూరు అభివృద్ధి, పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేసిన పట్టణానికి చెందిన సామాజికవేత్తలు అనకాపల్లి అక్కలనాయుడు, ఆచంటి విజయ్‌కుమార్, పైడిపాటి రాంబాబు విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.శాంతారాం, విజయ్‌కుమార్, జి.చంద్రశేఖర్, ఆనంద్‌మోహన్, ఎ.శివకుమార్, డి.సూరిబాబు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: పురపాలక సంఘ పరిధిలోని బలరాంపేటలో నివాసముంటున్న డబ్బూరి పుణ్యవతికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. కొంతకాలంగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న 1986లో ఏయూపీ స్కూల్‌లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.20వేలు అందించారు. కార్యక్రమంలో కాళ్ల జయమ్మ, కొరికాన యోగి, చెన్నూరి శ్రీను, సిచ్చిబుట్ల వెంకటరమణ, గోపి, జనార్దాన పాల్గొన్నారు.

ఎచ్చెర్ల టికెట్ కళాకే కేటాయించాలి

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని పొత్తుల్లో భాగంగా వేరే పార్టీకి అవకాశం ఇవ్వకుండా మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావుకే కేటాయించాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఎచ్చెర్లలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న కళా వెంకటరావుకు టికెట్‌ను కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుపించుకుంటామన్నారు. ఇదేం ఖర్మ, బాబు ష్యూరిటీ, శంఖారావం తదితర కార్యక్రమాలను గ్రామగ్రామాన నిర్వహించి పార్టీని పటిష్టపరిచామన్నారు. కళావెంకటరావు సీనియార్టీ, సిన్సియార్టీని గుర్తించాలన్నారు. పొత్తుల్లో భాగంగా వేరే పార్టీకి కేటాయిస్తే ఆ పార్టీ గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లడం కష్టమన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, నాయకులు అన్నెపు భువనేశ్వరరావు, పైడి ముఖలింగం, బల్లాడ అరుణ, సంధ్యాగజపతి, బచ్చు కోటిరెడి తదితరులు పాల్గొన్నారు.

భజనపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని జడ్పీ కార్యాలయం సమీపాన శ్రీ సత్యసాయి మందిరంలో భజన శిక్షణ, జ్యోతిధ్యానం పై భక్తులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. భజన్స్ రాష్ట్ర ఇన్‌చార్జి జి.శ్రీనివాస్ ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.గంగాధర్, అరుణ, సుధారాణి, వై.లింగరాజు, రామచంద్రరావు, అనాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం


ఈవోకి విరాళాన్ని అందిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం నిర్వహణకు వైజాగ్ వీఎం పాలెం ప్రాంతానికి చెందిన కె.సుజాత రూ.లక్ష విరాళంగా అందచేశారు. ఈ మేరకు ఆలయ ఈవో గురునాధరావుకు అందచేశారు.

నేడు చక్రధరుని డోలో యాత్ర

కవిటి: బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవ యాత్ర సోమవారం జరుగుతుందని ఆలయ ధర్మకర్త పి.కృష్ణారావు తెలిపారు. ఆదివారం స్వామి వారి చక్రస్నానం, ధ్వజా రోహణంతోపాటు స్వామివారి పుష్పయాగం, ఉంజల సేవలతో పాటు ఉత్సవ విసర్జన నీరాజనం కార్యక్రమాన్ని భక్తులతో కలిసి నిర్వహించారు. వేదపండితులు ఎం.నారాయణమూర్తి శిష్యబృందం పూజలు చేపట్టారు.

● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురంలోని జగన్నాథాలయంలో డోలోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ డోలా మండపం వద్ద రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వారి దర్శనవేడుకలు సోమవారం జరగనున్నాయి. ఈ ఉత్సవం కోసం బెల్లుపడకాలనీల ఉన్న డోలామండపాన్ని ఆలయ మేనేజర్ బెండి రామారావు పర్యవేక్షణలో శుభ్రపరిచి రంగులతో తీర్చిదిద్దారు. ఆలయంలో నిత్యారాధనలు అనంతరం శ్రీస్వామివారిని డోలామండపం వద్దకు తీసుకువెళ్లి పూజలు చేస్తారు.

కామదహనోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: పౌర్ణమి సందర్భంగా ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆల యంలో కామదహనోత్సవం రిక్షా స్టాండ్ గుడివీధిలో జరిగింది. అర్చకులు ఆరవెల్లి రామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. శివ పార్వతుల విగ్రహాలకు అ లంకరణ చేసి గుడివీధిలో తిరువీధి నిర్వహించారు. అలాగే న్యూ కాలనీలో విజయగణపతి ఆల యం వద్ద కామదహనోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్వాడీల సంఘ ప్రతినిధులు బాబూలాలే మనోజ్, అమిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయళ్లపై కేసు నమోదు

ఆమదాలవలస: పట్టణంలోని హడ్కోకాలనీ వద్ద ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని రూ.5,190 సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ధనరాజ తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో ధనరాజ తులసమ్మ సంబరాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. పట్టణంలోని పలు వీధులకు చెందిన భక్తులు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ, పానకాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో మట్టల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ కాలనీలో ఉన్న చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ ప్రతాప్ రుద్రరాజు, తవిటిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మట్టలు పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టల పండుగ నిర్వహించారు. అదేవిధంగా డగ్లస్ స్కూల్ దగ్గర ఉన్న కీస్టోన్ చర్చి ఆధ్వర్యంలో జాయల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు


శ్రీకాకుళం కల్చరల్: తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ఊరేగింపు


పాతపట్నం: కొరసవాడలో ఆంధ్రా బాప్టిస్ట్ ఆధ్వర్యంలో..

ఇచ్ఛాపురం పట్టణంలో..

ఇచ్ఛాపురం: పట్టణంలోని గొల్లవీధిలో గల ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి నుంచి క్రైస్తవులు మట్టలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు విజయ్‌కుమార్, వెంకటేష్, వీరబాబు, మహిళలు పాల్గొన్నారు.

కొరసవాడలో..

పాతపట్నం: కొరసవాడ ఆంధ్రా బాప్టిస్టు చర్చికు చెందిన క్రైస్తవులు మట్టలపండగను ఆదివారం నిర్వహించారు. కొరసవాడ ప్రధాన రహదారులపై ఈత మట్టలను ప్రదర్శిస్తూ ప్రదర్శన చేపట్టారు. పాస్టర్ పిలిప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి.అనిల్ కుమార్, లారెన్స్, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.